1337

# నేనేమి చేశాను!

నారాయణరావు బండి అందదేమోనని, స్టేషనుకి హడావిడిగా నడుస్తున్నాడు. నడుస్తున్నప్పుడుకూడా అతని తలలో ఆలోచనలు నడుస్తూనే ఉన్నాయి. ఈవిషయంలో కొంచెం జాగ్రత్తగా ఉండమని వెనుకనుంచి ఒక రిక్షా హెచ్చరికచేసి మరీ ముందుకు సాగిపోయింది. అప్పుడే ప్రక్కనుంచి ఒక కారు రంయ్‌మని దూసుకుంటూ ముందుకు పోయింది. అప్పటికీ అతను బాటకొక ప్రక్కనుంచే నడుస్తున్నాడు. ఎంత ఒదిగి నడుస్తున్నా ఇంకా తప్పుకో, తప్పుకో అని ఏవేవో వాహనాలు అరుస్తూనే ఉన్నాయి. ఈ వాహనాల కెందుకింత హడావిడో నారాయణరావు కర్థంకాలేదు. "ఈ లోకంలోంచే తప్పుకో బాబూ. ఎందుకు మాకీ అడ్డం" అన్నట్లుగా ఉంది వాటి నడక. ఈ ఆలోచన రాగానే అతని ఎద కుమిలి కుమిలి ఏడ్చింది? ఏమిటీ ఒదిగి ఒదిగి నడవటమని పించింది. ఇంట్లో భార్యకా ఒదిగి ఉండాలి. బయట యజమానికా అణిగి ఉండాలి. వీధిలో అడ్డమైనవాళ్ళకా తలవంచాలి, "ఛీ...ఏం బ్రతుకు?" అనుకున్నాడు.

ఎండ ఫెళ్లున విరగ కాస్తూంది. తారురోడ్డు కుతకుత ఉడుకుతూంది. కూల్ డ్రింక్ షాపుల్లో గ్లాసుల కెంతో కరువుగా ఉంది. చెమటలు గ్రక్కుతూ రిక్షావాడు జీవితాన్ని ఆ ఎత్తుమీదికి ఈసురోమని లాగుతున్నాడు.

అప్పుడే నారాయణరావు వీపుమీద ఛెళ్ళున ఎవ్వరో ఓ చరుపు చరిచారు. నారాయణరావు నిస్త్రాణగా నిలబడి పోయాడు. 'అబ్బా!' అనుకుంది అతని మనసు. బాధగా 'నే నెవ్వరి కేంచేశాను.' అనుకుంటూ అతని ఎద, మొగాన్ని ఆ ప్రక్కకు త్రిప్పింది. ఆప్రక్క అతనికి తెల్లని పాల గువ్వల్లాంటి పళ్లు 'ఏరోయ్ బాగున్నావా' అని పల్కరించాయి.

చాన్నాళ్ళకు పాత స్నేహితుడు కనిపించాడు కదా అని, నారాయణరావు మనసు ఏమాత్రం సంతోషించలేక పోయింది. ఆ మనసు, ఆ దెబ్బతగిలిన స్థలాన్ని చేతితో నిముకోవాలని ఆత్రుతపడింది. కాని ఏశక్తో ఆపనిచేయనివ్వలేదు. ఇంతలో ఆ మిత్రుడు 'ఇలా మారిపోయావేంటిరా' అన్నాడు కంఠంలో ఎంతో బాధను కలబోసి. వెనుకనుంచి నీ నడకను బట్టి ఆనవాలు పట్టగలిగాను కాని, నిజంగా నిన్ను ఎదుటి నుంచి చూస్తే అసలు పోల్చుకోలేక పోయేవాడినేమో' అన్నాడు.

నారాయణరావుకు తనకళ్ళల్లో నీళ్లుతిరుగుతాయేమో నని భయం వేసింది. "చాల కష్టంగా ఉందిరా జీవితం" అని

చెప్పడానికి అతనికి చాల కష్టమయింది. వెంటనే నవ్వుకాని నవ్వును మొగంమీద ప్రదర్శించి, 'అయితే నువ్వు ఇక్కడ ఏం చేస్తున్నావ్...మీ నాన్నగారు కులాసాఁ...? అన్నాడు. ఈ మాటలతో ఆమిత్రుడు పకపకానవ్వి, 'అరే...నా బట్టలు చూచైనా నువ్వు గ్రహించొచ్చే ... నేనేం చేస్తున్నదీ' అన్నాడు.

నారాయణరావు తనకు, కళ్ళముందు కనిపిస్తున్నది కూడ గ్రహించేశక్తి లేకుండా పోతోందేమిటి అని మనసులో దిగులుపడి పోయాడు. పైకి 'అయితే నీకు రైల్వేలో ఉద్యోగం ఎప్పుడు దొరికింది? మనిద్దరం రెండున్నర సంవత్సరాల క్రితం కాబోలు, ఏలూరులో ఉన్నప్పుడు అప్లికేషను పెట్టాం.' అన్నాడు.

దానికా మిత్రుడు, 'ఔనురా మనం అప్పుడు దరఖాస్తు పెట్టామాఁ అనుకోకుండా ఆరునెలల క్రితం వాళ్ళ దగ్గఱనుంచి పిలుపు వచ్చింది. నా మట్టుకు నేనే ఆశ్చర్యపోయాను. మనకిక రైల్వే ఉద్యోగం దొరకడం ఉత్తదే అనుకున్నాను. కాని అదృష్టం అనుకో. లక్కీగా...మనకీ, ఈ వుద్యోగానికి ముడెట్టేశారు. నీకు చాలసార్లు వుత్తరం వ్రాయాలనుకున్నాను. ఏమిటో తీరుబడి చచ్చి ఏడవదు. ఒకసారి మీ అన్నయ్య ఏలూరులో కనిపిస్తే మీవాడికేమైనా ఇంటర్వ్యూ వచ్చిందాండి అని అడిగాను. ఆయన ఏమీ రాలేదన్నాడు.

సరేకాని, రెండు కూల్ డ్రింకులు త్రాగొద్దాంరా ... ఎండ మహాదారుణంగా వుంది' అన్నాడు.

నారాయణరావుకు బండి అందదేమోనని భయంగా వుంది. 'కూల్ డ్రింకులు త్రాగుతూ కూర్చుంటే, బండి అందక పోవొచ్చు. ఏలూరు వెళ్ళి అన్నయ్యను బ్రతిమాలి, ఓవం దైనా పుట్టించుకొని కనీసం రేపుసాయంకాలానికైనా ఇక్కడ వుండకపోతే పరిస్థితులు తారుమారై పోతాయి. అను కున్నాడు. వెంటనే ఆస్నేహితునితో, 'వస్తారా నేను ఏలూరు వెళ్ళాలి. బండి దాటిపోతుందేమో...అర్జంటు పనివుంది అన్నాడు.

వెంటనే ఆమిత్రుడు, 'ఏలూరికా...అరే...ఇంకేం... మనిద్దఱమూ కలసే పోవొచ్చు. బండి దాటిపోతుందని నీకేమీ భయం అక్కర్లేదు. రా...' అంటూ అతను నారాయణ రావును కూల్ డ్రింక్ షాపులోకి లాక్కుపోయాడు.

ఆ చల్లని పానీయం కడుపులో పడినమీదట, నారా యణరావు కళ్ళల్లో ప్రాణం కదిలింది. ఆ మిత్రునితో కలసి, స్టేషనుకు గబగబా నడచాడు. నడుస్తూ, నడుస్తూ ఒకసారి అతను తన గెడ్డం తడివి, చూసుకున్నాడు. 'ఏరా శివం... నా ఆకారం ఎలా ఉంది' అనబోయాడు. తన ఆకారం ఎట్లా వుందో, అతను ఇందాకనే అన్నముక్క చప్పున స్ఫురించి, ఆమాటను వెంటనే దిగమ్రింగేశాడు. తనకు శివంకన్న ఎక్కువ

మార్కులే వచ్చినా, తనకు ఇంటర్‌వ్యూ ఎంచేత రాలేదో అని మనసులో వితర్కరించుకున్నాడు. శివం ఉషారుగా సిగరెట్టుమీద సిగరెట్టు తగలేస్తూ చలాకీగా వెల్తూంటే, కడుపు నిండా ఉంటే ఎంత ఆనందంగా ఉండొచ్చు అనుకున్నాడు. కాని వెంటనే వాళ్ళన్నయ్య జ్ఞాపకానికివచ్చి, కడుపునిండా తింటూ ఉన్నా ఎక్కడలేని తాపత్రయంతో ఎప్పుడూ 'లేదో' అని గోల పెట్టే అతని మనసుకు, ఇల్లాంటి ఆనందం స్వాధీనం కాదేమో అనుకున్నాడు, ఇంతా ఖర్చుచేసుకొని వెళ్ళినా, అన్నయ్య ఆ పైకం ఇవ్వకపోతే, అప్పుడు తనేంగావాలో తోచక తికమక పడ్డాడు. కాళ్ళా వేళ్ళా బడైనా, డబ్బు తీసుకు రాకపోతే ఎల్లుండి తన సంసారం వీధిలో బడుతుంది. ఆ దృశ్యం తలచుకుంటేనే దుఃఖం వస్తోంది.

శివంతో నడుస్తూంటే, నారాయణరావుకు నడచినట్లే అనిపించలేదు. స్టేషను రాగానే, గబగబా ఏలూరుకు టిక్కెట్టు తీసుకోడానికి బయలు దేరాడు. శివం, వెంటనే నీకేమైనా మతిపోయిందా ఏమిట్రా...రారా...బలేవాడివే...అంటూ అతన్ని లోనికి లాక్కుపోయాడు.

పాపం నారాయణరావు టిక్కెట్టు లేకుండా ఎప్పుడూ ప్రయాణం చెయ్యలేదు. 'కొంపదీసి ఎవరైనా పట్టుకుంటే' అనుకొని హడలిపోయాడు. తనదగ్గర రానుపోను చార్జీలకు సరిపడే డబ్బుకూడలేదు. ఆమీదట ఇలాశివం ఎక్కమన్నాడు. నేను ఎక్కాను అని తను చెప్పలేదు కదా! ఎందుకొచ్చిన

గొడవ. తను పట్టుబడితే బోలెడన్ని పనులు దండుగ...అబ్బే ...టిక్కెట్టు కొనుక్కోకుండా రైలెక్కకూడదు అనుకున్నాడు. ఇలా అనుకొని శివంతో 'కాదురా నీకు తెలియదు. ఎందుకేనా మంచిది నన్ను టిక్కెట్టు కొనుక్కోనిద్దూ...' అన్నాడు. శివం స్నేహితుని అమాయకత్వానికి పకపకా నవ్వాడు. 'చాల్లే...ఇకరా...' అంటూ ముందుకు సాగిపోయాడు. నారాయణరావుకు ఏమిచెప్పడానికి తోచలేదు. సరే ... ఏంజరిగితే అదే జరుగుతుంది అనుకొని రైలెక్కాడు.

నారాయణరావు బండిలోకూర్చున్న మీదట శివం, 'ఎందుకురా అలా భయపడి పోతావ్ ...' అంటూంటే పాపం అతను దానికి జవాబుగా ఏమీ చెప్పలేకపోయాడు. శివంవైపు వెర్రిగా చూశాడు అంతే...

ఇంకో స్టేషను రాగానే శివం, నారాయణరావును తీసుకపోయి, సెకండుక్లాసులో కూర్చుండబెట్టాడు. నారాయణరావు గుండె లొక్కసారిగా దడదడలాడాయి. అతనికి ఏమనడానికి నోరురాలేదు. శివం ఏదైన స్టేషనులోదిగి తిరిగిఅతను తన దగ్గరకు వచ్చేవరకు తనప్రాణం అరచేతిలో పెట్టుకొని కూర్చునేవాడు. మెత్తని కుషన్లమీద కూర్చున్నా, అతని మనసు మనసులో ఉండటం లేదు. జీవితంలోని ఒడుదుడుకులను గురించి ఆమనసు ఏమిటో పిచ్చిపిచ్చిగా ఊహిస్తోంది.

తనకే ఈ ఉద్యోగం వచ్చిఉంటే తన జీవితం ఎట్లా ఉండి ఉండేదో అనుకున్నాడు, తను ఇట్లా శివంలా ఒకనాటికే

ధైర్యం చేయలేననుకున్నాడు. ఔను...తను ఈ విషయంలో ఎందుకూ పనికిరానివాడు. అందుకనే తనకీ ఉద్యోగం రాలేదు. ఏమిటో మార్కులు మార్కులు అనుకుంటాంగాని అవి నిత్యజీవితంలో ఎందుకు పనికివచ్చినట్లు? అన్నయ్య ఎంతో దండయాత్రలు చేసిగాని గట్టెక్కేవాడు కాదట! నాన్న ఇదేవిషయం ఎప్పుడూ ఎత్తిపొడిచేవాడు. అయినా అన్నయ్య ఇప్పుడు ఎంతో తెలివైన మాష్టరుగా చలామణీ అయిపోతు న్నాడు. పిల్లలకు చదువు చెప్పినా చెప్పకపోయినా మరి ఏం విశేషముందో గాని. అంతా అక్కడికే ప్రైవేటు చెప్పించు కోడానికి వస్తారు. పరీక్షలలో, ఇదిగో ఈ ప్రశ్నలు వస్తాయి, ఆ ప్రశ్నలు వస్తాయి అని, ఆ మాష్టర్ల దగ్గర, ఈ మాష్టర్ల దగ్గర సంపాదించిన ప్రశ్నలు ఆ పిల్లలకు చెప్పి వాటికి సరైన జవాబులు ఆ రాత్రికిరాత్రి వాళ్ళచేత పారాయణం చేయ డంతో డబ్బు కొల్లలుగా వచ్చి పడుతూంది. ప్రతి ఒక్క తండ్రీ పిల్లవాడు పరీక్షలో కృతార్థుడు కావాలనే కోరుకుంటు న్నాడు. కుర్రవాడి నెత్తికేమైనా ఎక్కుతుందా, లేదా అని ఆలోచించే పాటి శ్రమకూడ తీసుకోవడం లేదు. ఇటువంటి మనస్తత్వంగల తండ్రులు ఉన్నారుకాబట్టే, అన్నయ్య వాళ్ళ దగ్గర సునాయాసంగా డబ్బుగుంజుకుంటున్నాడు. ఇప్పటికి పది వేలు పైనే ఆస్తి సంపాదించి ఉంటాడు. అయినా ఒక్క కానీ లేనట్లు మాట్లాడుతాడు. ఇంతకీ డబ్బడగ్గానే ఏమంటాడో. ఇప్పుడు లేదంటే ఏంచెయ్యాలి? ఎలా......

నారాయణరావు ఒకసారి చుట్టూ కలయజూశాడు. 'శివం తన దగ్గరలేడు, మళ్ళీ ఇంకో స్టేషను రాగానే తన దగ్గరకొచ్చి చూస్తాడు. అబ్బ! శివం ఎంత మంచివాడు! తనంటే వాడికెంత ప్రేమ! పోనీ శివాన్ని ఏమైన సర్దుబాటు చేయమని అడిగితేనో. కనిపించాను కాబట్టిఅడిగాడుఅనుకుంటా డేమో మరి; అదీ నిజమే! అబ్బే ఇలా అడగటం బాగుండదు. వాడికి మాత్రం డబ్బెక్కడనుంచి వస్తుంది. జీతం అంతా తీసు కెళ్ళి వాళ్ళనాన్న చేతిలోపోసి ఉంటాడు. అంతే వాడిని అడ గటం మంచిదికాదు. అడిగినా దొరకదుకూడాను. అనవస రంగా వాడ్ని బాధపెట్టిన వాణ్ణికావడం తప్పించి, అంతకు మించి ఏమీజరుగదు. పాపం ఇవ్వలేక పోయానుకదా అని వాడెంత బాధపడతాడో కూడాను. అంతే ఇంక ఎంతవడ్డీకైనా అన్నయ్య దగ్గరే ఎలాగో ఓలాగ ఆ డబ్బు పుచ్చుకోవాలి అనుకున్నాడు.

నారాయణరావు మనసంతా ఆ వంద రూపాయలు ఎట్లాసంపాదించాలి అన్నవిషయం మీాదే లగ్నమైపోయింది. శివం పాపం ఎంత వుషారుగా వుల్లాసంగా మాట్లాడినా, అత నితో ఒక్కసారికూడ కలివిడిగా మాట్లాడలేక పోయాడు. ఏలూరు రాగానే, 'వస్తారా శివం...' అంటూ బండి దిగి పోయాడు. 'ఈ సారి బెజవాడ వచ్చి నప్పుడు మా ఇంటికి రారా' అంటూ అతనికి తన ఇంటి అడ్రసు ఇచ్చాడు. ఆ మిత్రుడు. 'తప్పకుండా వస్తారా' అంటూ బండితో ముందుకు సాగిపోయాడు. ......

నారాయణరావు బడిదిగాడన్న మాటేగాని, అతని మనసు మనసులోలేదు. అతనికి వాళ్ళన్నయ్య డబ్బు యిస్తా డన్న నమ్మకం ఏమీలేదు. అయినా అతన్ని తప్పించి మరొ కరి దగ్గఱకు పోయి, అడిగినా ఏమీ లాభంలేదు. పాపం అతనికిచ్చే వాళ్ళెవరూ లేరు.

నారాయణరావు అన్నగారి పేరు మధుసూదనరావు. అతనికీ నారాయణరావుకూ వయసులో చాల వ్యత్యాస ముంది. మధుసూదనరావు మొట్టమొదటికొడుకైతే నారాయ ణరావు చివరివాడు. వాళ్ళిద్దఱిమధ్యా సుమారు పది సంవత్స రాలు పైనే, వయస్సులో తేడా వుంది. ఆ మధ్యకాలంలో పుట్టిన పిల్లలు, నలుగురు కొంతవయసు వచ్చిన తరువాత, ఏవేవో జబ్బులతో తలిదండ్రులకు పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చి, ఈ లోకాన్ని విడిచిపోయారు. ఈ దుఃఖభారంతో నారాయణ రావు తల్లి అతను ఎనిమిదేళ్ళ వాడప్పుడు కాలంచేసింది. ఆ తరువాత తండ్రే, వీళ్ళకు తల్లీ, తండ్రీ అన్నీ అయి పెంచుకొ చ్చాడు.

మధుసూదనరావుకు అదేమిటో గాని, నారాయణ రావంటే మొదటినుంచీ కిట్టేదిగాదు. నారాయణరావును అతనెప్పుడూ ఆ ఇంట్లో పనిచేసే కుఱ్ఱాడిలా చూసేవాడు. ఏపనీ లేకపోయినా వాడికి, అతను ఏదో ఒక పని అప్పజెప్పే వాడు. ఆ పనిలో ఏమాత్రం తేడాపాడాలు వచ్చినా వాడి

చెమ్డా లెక్కదీసేవాడు. ఉంగరాల చేతితో మొట్టికాయలు మొట్టేవాడు. వాడు ఆ బాధతో, వాళ్ళనాన్నగారి దగ్గరకు పోయి, 'చూడునాన్నా అన్నయ్య ఉత్తిపుణ్యానికి ఎలా మొట్టుతున్నాడో' అని చెప్పేవాడు. ఆయనకు మధుసూదన రావంటే ఎక్కడలేని మంట. వాడంటే వట్టి మొద్దబ్బాయని ఆయన భావన. అందుకు తగ్గట్టుగానే అతను, ప్రతిక్లాసు తప్పుతూ ఉండేవాడు. స్కూలు ఫైనలు గట్టెక్కే టప్పటికి, బ్రహ్మాండం బ్రద్దలయింది. సెకండ్రీ గ్రేడు ట్రైనింగు ప్యాసవ డానికి తాతలు దిగొచ్చారు. అంచాత ఆయన, 'ఈ చవటకు వాడ్ని కొట్టడం తప్పిస్తే ఇంకేమీ చేతగాదు' అనేవాడు. మధుసూదనరావు కా సమయంలో తండ్రిమీద ఎక్కడలేని కోపంవచ్చేది. "ఇంత పెద్దవాణ్ణి నన్ను పట్టుకొని ఆ కుర్రకుంక ముందు, మందలిస్తాడా." అని విషసర్పంలా తనగదిలో బుసలు కొట్టేవాడు. తండ్రి ముందు మాత్రం మాట్లాడలేక పోయే వాడు.

నారాయణరావు క్లాసులో ఎప్పుడూ మొదటివాడు గానే ఉండేవాడు. వాడు ధర్మఘారములోకి తన పండ్రెండవ ఏట "ఝూ" మని వచ్చేటప్పటికి, మధుసూదనరావు అప్పటికి ట్రైనింగు ప్యాసయానని పించుకున్నాడు. ఇందువల్ల నేనేమో అతనికి నారాయణరావంటే కన్నెర్రగా ఉండేది. వాడు సాయంకాలం ఆడుకుంటూ ఉంటే, 'ఎందుకురా ఆడుతు న్నావ్. వెధవా దెబ్బలు తగిలితే మమ్మల్ని చంపడానికా

కూర్చొని చదవక అని, తరిమి తరిమి నాలుగు తగలనిచ్చే వాడు. వాడు ఏడుస్తూ, 'నేను చదవకపోయినా నీకన్నా నయమేలే' అనేవాడు. దానితో అతనికి చిర్రెత్తేది.

ఇలా వుండగా ఆసంవత్సరంలోనే మధుసూదనరావుకు వివాహమయింది. ఆ సంవత్సరంలోనే అతనికి ఉద్యోగం దొరికింది. అంతే... అతను ఒకరోజున ఉన్నట్టుండి తండ్రితో 'ఈ ఇంట్లో ఖర్చులు రోజురోజుకీ, ఓ తాడూ బొంగరం లేకుండా పెరిగిపోతున్నాయి. తేలేక చస్తూ ఉంటే పైగా వీడొకడు. చదువు మానిపించి ఏ కొట్టులోనో గుమాస్తాగా పారెయ్యక వాడ్ని నెత్తి కెక్కించుకుంటున్నావు. వేణ్ణీళ్ళకు చన్నీళ్ళగా వాడేమైనా తెస్తే, సంసారం గుట్టుగా పోడానికేమైనా వీలుంటుందేమోగాని, ఈ అడ్డగాడిదను ఇలా మేపుతూ కూర్చుంటే, సంసారం తెల్లారినట్టే' అన్నాడు.

దీనితో ఆ ముసలాయన గుండెలు భగ్గుమనిపోయాయి 'ఏంటిరా వెధవా ప్రేల్తున్నావ్... మళ్ళీ ప్రేలు; ఇవ్వాళ ఉద్యోగం వచ్చిందని, కళ్లు నెత్తికెక్కి ఏడుస్తున్నావటరా... ఛీ... ఎందుకురా వెధవబ్రతుకు. వీడే నువ్వయితే, నీకు తగలేసిన డబ్బుతో ఈపాటికి ఎమ్. ఏ. ఫస్టుక్లాసులో వచ్చేవాడు కాదటరా, వాడ్ని గుమాస్తాగాచెయ్యమనడానికి నీకు నోరెట్లా వచ్చిందిరా' అన్నాడు.

అంతటితో మధుసూదనరావు ఆగితేబాగుండేది. కాని ఎందుకాగుతాడు. వెంటనే, 'చదివిస్తే చదివించూ. ఎవ్వ

ద్దొద్దన్నాడు. ఉట్టి కెక్కలేనమ్మ, స్వర్గానికేడ్చిందని; మింగ మెతుకు లేదుగాని మీసాలకు సంపెంగనూనె' అన్నాడు.

దానితో ముసలాయన చర్రున లేచాడు. 'ఏంటిరా వెధవా గుడ్డొచ్చి పిల్లనెక్కిరించినట్లు. నువ్వట్రా నాకీనాటికి చెప్పేది. కుళ్ళుబోతు వెధవా... నీ సాయం లేనిదే వాడ్ని చదివించ లేననుకుంటున్నావేమో ఇవ్వాళ వ్యాపారం చిదిగి పోయిందని, పెళ్ళాం నువ్వూ కలసి ఇంక ఇక్కడ వుంటే లాభంలేదని, వాడి చదువుమీదికి దండెత్తుతున్నారా... నా కంఠంలో ప్రాణం వున్నంతకాలం వాడి చదువుకేఆటంకం రాదు. నీ కంతగా కష్టంగా వుంటే పోతే పో... నువ్వు పుట్ట లేదే అనుకుంటాను. కృతఘ్నపు వెధవా" అన్నాడు.

అంతే. ఆ మరునాడే మధుసూదనరావు, తండ్రితో ఇంకొన్నాళ్లు కలిసివుంటే అప్పులు పంచుకోవలసి వస్తుందని చల్లగా వేరుపడిపోయాడు.

ఆ ముసలాయన, ఈ బాధలకు గుండెల్లో కుమిలి పోతూ, అతికష్టంమీద నారాయణరావును, స్కూలుఫైనలు దాకా ఈడ్చుకొచ్చి, ఒకరోజున అకస్మాత్తుగా నారాయణ రావును దారీ తెన్నూలేని ఈ ప్రపంచంలో విడిచి శాశ్వతంగా కన్నుమూశాడు.

నారాయణరావు ఒక్కసారి గుండెలు బాదుకొని కెవ్వుమన్నాడు. నాలుగు ప్రక్కలనుంచీ అతన్ని చీకట్లు ఈ

విధంగా ముట్టడించటంతో అతని కంతా అయోమయమై పోయింది. 'ఇంక నాకు దిక్కెవ్వరు నాన్నా' అంటూ అతను బావురుమన్నాడు. శవంచుట్టూ మూగిన యిరుగు పొరుగు వారంతా ఆ దృశ్యంచూసి కళ్ళనీళ్లు పెట్టుకున్నారు. ఆ మాట విన్న మధుసూదనరావు అంతమందిలోనూ తమ్ముడు తనను అవమానపరుస్తున్నాడని, మనసులో అగ్నిని రాజేసుకున్నాడు.

"వెధవా! ఏమిటిరా ఆ ప్రేలాపన. నేను చచ్చాననుకున్నావా ఏం? దిక్కెవ్వరూ లేరని అఘోరిస్తున్నావ్, అలా ఏడిస్తే పదిమందీ నీకేమైనా ఒరగబెడతారని అనుకుంటున్నావేమో బాగుపడే లక్షణం నేర్చుకో. నేను చెప్పినట్లు అప్పుడే నువ్వు గుమాస్తాగా తగలబడి ఉంటే ఇప్పుడిలా యేడ్వవలసిన అవసరం ఏంవచ్చేది" అన్నాడు.

నారాయణరావు పాపం ఆ మాటలకు ఖిన్నుడై పోయాడు. బిక్కచచ్చిపోయాడు.

అప్పుడే ఓ పెద్దమనిషి, మధుసూదనరావును బాగా మందలించి విడిచిపెట్టాడు, "చాల్ చాల్లేవయ్యా ఆమాటలు. తండ్రితో ఉంటే కష్టాలు పంచుకోవలసి వస్తుందని, వేరింటి కాపురం పెట్టిన నువ్వే చెప్పాలిలేవయ్యా మాలావు...చాల్ చాల్లే... పెంచకేం జేస్తావ్ ? నీ తోడబుట్టినవాడితో అనవలసిన మాటలివటయ్యా ? నీతండ్రి శవం అలా పెట్టుకుని— నీకేమేనా జ్ఞానం ఉండేనా అలాంటి మాట లంటున్నావ్. అర్థం శుభం ఎరుగని అమాయకుని మాటలకు, పెడర్థాలు

తీస్తూ, నాలుగు రాళ్లు వాడి నెత్తిన వేసిపోదాం అనుకుంటు న్నావేమో, మీ నాన్న నిన్ను చదివించినట్లే, నువ్వూ అతన్ని చదివించక తప్పదు తెలుసా" అన్నాడు.

ఆ మాటలతో మధుసూదనరావు చల్లగా ఇంట్లోకి జారిపోయాడు. తమ్ముణ్ణి లోపలికి పిలిచి "నీ దగ్గర ఇప్పుడు ఏమాత్రం ఉంది" అన్నాడు, నారాయణరావు గుండెలు బ్రద్ద లయ్యేట్టు ఏడ్చేడు. "డబ్బేమీ లేదన్నయ్యా" అంటూ. మధుసూదనరావు ఒక్కసారి చిరాకును పెంచేసుకొని "నా కొంపలో నిప్పెట్టటానికే మిగిలారు మీరంతాను. నన్ను సుఖంగా బ్రతకనియ్యరు" అంటూ, తండ్రికి అంత్యక్రియలు జరపడానికి, అతి కష్టంమీద, కళ్ళ నీళ్లు పెట్టుకుంటూ మనీ పర్సు, విప్పాడు.

ఆనాటినుంచీ నారాయణరావు అన్నగారి దగ్గరే పెరిగాడు. రెండు సంవత్సరాలు ఆ యింట్లో యమయాతన పడ్డాడు.

భోజనానికి కొంచెం త్వరగా వస్తే, "అబ్బబ్బ... వండలేక ఛస్తున్నానమ్మా. మాయదారి సంతంతా మా ఇంటిమీదే పడి మేస్తోంది" అని లోపలినుంచి వినిపించీ విని పించని పలుకులు వినిపించేవి. కొంచెం ఆలస్యంగా వస్తే, "ఏం...దొరగారికి వేళకావడంలేదు కాబోలు, ఎక్కడెక్కడ తంద నాలాడుతున్నావురా ఇంత రాత్రి వరకూ" అంటూ మధుసూదనరావు కొట్టే దూకుడు చూపించేవాడు.

ఇక నారాయణరావు పరీక్షల్లో తెచ్చుకున్న మార్కుల్ని, మధుసూదనరావు జాగ్రత్తగా పరిశీలించేవాడు. ఏలోపమూ లేకపోయినా. "సైన్సులో యాభై మార్కులే వచ్చేయేం" అని అరచేవాడు, "పేపరు చాలా కష్టంగా ఉందన్నయ్యా" అంటే, "ఇప్పుడే ఇలా వస్తూంటే పబ్లిక్ ఎగ్జామినేషన్‌లో బండిసున్నాలే వస్తాయ్. ఏమో. నాకు నమ్మకం లేదు నువ్వు ప్యాసవుతావని. నువ్వు ఫేలయితే, నిన్ను తిరిగి ఇక్కడ చదివించేవాడు ఎవ్వడూ లేడు తెలుసా..." అని హడలెత్తించేవాడు.

ఇక పాపం, నారాయణరావు బట్టలు చాకిరేవు మొగం చూడటమన్నది ఎప్పుడూ జరగనేలేదు. అతని బట్టలు అతనే వుతుకుకొనేవాడు. ఇంట్లోకి కావలసిన నీళ్ళు అతనే తెచ్చేవాడు, అన్నగారు అప్పజెప్పిన కుర్రవాళ్ళకు పాఠాలు చెప్పేవాడు. ఇన్ని పనులూ చేస్తూ ఉన్నా అతను రాత్రి వేళల కొంచెం ఎక్కువసేపు చదువుకుందామని కూర్చుంటే కరంటు కాలిపోతోందని ఆ అన్నయ్య గోలెత్తిపోయేవాడు. "పగలు పది గంటలవరకూ గుడ్డిగుర్రాలకు పళ్లు తోముతావా ఏం?" అనేవాడు, కాని పగలు ప్రైవేటు చెప్పించుకోడానికి వచ్చిన పిల్లల్ని అప్పజెప్పేవాడు. లేకపోతే బజారులోంచి కూరగాయలు తేడానికి పంపించేవాడు. సాయంకాలం నాలుగున్నర అయ్యేప్పటికి, ఇంటివద్దగర ఉండకపోతే, నోటికొచ్చినట్లు తిట్టేవాడు. రాత్రివేళల కూడా అప్పుడప్పుడు

ట్యూషను చెప్పించుకోడానికి వచ్చినవాళ్ళకు పాఠాలు చెప్ప మని శాసించేవాడు.

ఇన్నింటినీ సహించి పిచ్చి నారాయణ, అలాగే తల వంచుకొని, కళ్ళనీళ్ళు బెట్టుకొనేవాడు కాని, ఒకరితో ఎప్పుడూ తన కష్టాలను చెప్పుకున్న పాపాన పోలేదు. ఇరుగు పొరుగువాళ్ళతో మాట్లాడితే అన్నయ్య ఏమంటాడో అని భయపడిపోయేవాడు. "అయ్యో తలిదండ్రులు లేని కుర్రా" డని ఎవరైనా ఏ పండో కాయో చేతిలో పెడితే అవి పుచ్చు కోడానికే భయపడిపోయేవాడు. అందుకు తగ్గట్టుగా ఆ అన్నయ్య, "ఏరా... తిన్నింటి వాసాలుకూడా లెక్కపెట్టడం నేర్చుకున్నావ్... మేం సరిగా చూడడంలేదని ఆ భూష య్యతో ఏమిటో చెప్పావటేమిటి?" అనేవాడు. పాపం నారాయణరా వీ అభూతకల్పనకి ఏం జవాబీయగలడు. "లే దన్నయ్యా నేనలా ఏమీ చెప్పలేదు" అనేవాడు. "ఊఁ, సరేలే. ఇంకెప్పుడైనా ఇంకెవడింటిదగ్గరైనా కనబడు చెప్తాను" అనేవాడు.

ఈవిధంగా ఎన్ని అడ్డంకులున్నా, ఎన్ని కష్టాలొచ్చినా నారాయణరావు స్కూలుఫైనలు పరీక్ష మంచి మార్కుల తోనే ప్యాసయ్యాడు. అంతటితో తన కష్టాలు తొలగిపోతా యని నారాయణరావు భావించాడు. కాని అలా జరగలేదు.

అతను పదిహేనేళ్ళ కుర్రవాడైనా తిండి సదుపాయం లేక పన్నెండేళ్ల కుర్రవాడిలాగే ఉండేవాడు. అదేవిధంగా

ఆ అన్నగారివద్ద అతని మనస్సుకూడా వికసించలేదు. అతనిలో పూర్తిగా కుర్రతనమూ, ప్రపంచమంటే ఎక్కడలేని భయమూ మాత్రం గూడుకట్టుకొని కూర్చున్నాయి.

తమ్ముడు స్కూలుఫైనలు ప్యాసయిన తరువాత మధుసూదనరావు ఎక్కువగా విసుగుకోవడమూ, అతనికి పను లెక్కువగా చెప్పడమూ తగ్గించేశాడు. నారాయణరావు అప్పటివరకూ పడిన బాధలన్నీ మరచిపోయి, అన్నయ్య ఏమి చేసినా తన బాగుకోసమే అనుకోవడం మొదలుపెట్టాడు, అయినా అప్పటికే అన్నయ్య దగ్గిర పూర్తి చనువు తీసుకొని మాట్లాడటానికి, అతనికిప్పటికీ భయంగానే ఉంటోంది. నాలుక తొట్రుపడుతూనే ఉంది.

ఒకరోజున ఏలాగోఓలాగ చొరవ చేసుకొని, నారాయణరావు వాళ్ళన్నయ్యతో "నేనూ ట్రైనింగు చదువుతా నన్నయ్యా... వాళ్ళిచ్చే డబ్బుకాక, ప్రైవేట్లు చెప్పి కొంత సంపాదిస్తాను. దానితో నా భారం కొంచెం నీకు తగ్గుతుంది" అన్నాడు.

ఈమాట వినగానే మధుసూదనరావు దిగ్భ్రాంతుడై పోయాడు. కాని వెంటనే తమాయించుకొని "ఏమిటీ... నువ్వు మాష్టరు గిరీ వెలిగిద్దాం అనుకుంటున్నావ్ ?... సరిసరి...ఎంతరిచి చచ్చినా ఇందులో మిగిలేదేముందిరా... ఈ ప్రైవేటుకొచ్చే కుర్రాళ్ళను చూసి, నువ్వేదో నేను

బాముకుంటున్నా ననుకుంటున్నావు కాబోలు. ఇందులో సరిగా జీతమిచ్చి చచ్చేదెవడు ? చూస్తున్నావుగా జీతాలెగేసి మానేసేవాళ్లెంతమందో. నువ్వేదో ఏ రైల్వే ఉద్యోగమో సంపాదిస్తావు... అభివృద్ధిలోకివస్తావని నేననుకుంటూవుంటే— నీకూ ఈ పంతుళ్ళ పనిమీదే మోజుకుదిరిందీ. హాయిగా ఏ రైల్వే ఉద్యోగమో అయితే రెండు చేతులతోనూ సంపాదించొచ్చు. పోనీ... నువ్వు నిజాయితీగా బ్రతకాలనుకొన్నా... హాయిగా కాలుమీద, కాలేసుకొని, వాళ్లిచ్చే జీతంతో బ్రతకొచ్చు. అన్నాడు.

ఈ మాటలతో కుర్రవాడైన నారాయణరావుకు, ఒక్కసారి రైల్వే ఉద్యోగం మీదికి మనసు పోయింది. ఆ ఆశతోనే తను ఇక బ్రతకాలకున్నాడు. తనకు మంచి భవిష్యత్తు ఉందని ఏవేవో కలలుగన్నాడు.

మధుసూదనరావు ఆ మరునాడే తమ్ముడి దగ్గరకొచ్చి 'నీ అదృష్టం బాగుందిరా... మన శ్రీహరి కొట్లో నీకు పాతిక రూపాయిల ఉద్యోగం చూశాను, రేపేవెళ్లి చేరు' అన్నాడు. నారాయణరావు అన్నగారి మాట జవదాటలేదు. వెళ్లి మరునాడే పనిలో చేరాడు.

ఇక ఆ పనికి అంతూ పంతూ ఎక్కడా ఉండేదికాదు. ప్రొద్దుట ఏడు గంటలకు అక్కడకు వెళ్లేవాడు; మధ్యాహ్నం ఓగంట మినహాయిస్తే తిరిగి రాత్రి ఇంటికి చేరేటప్పటికి ఎనిమిది దాటిపోయేది. అయినా నారాయణరావు అలాగే

పనిచేస్తూ పనిలో మంచివాడుగా పేరు సంపాదించటానికి, ఎప్పుడూ ప్రయత్నించేవాడు. కాని అలా రాత్రి ఎనిమిది దాటేవరకూ పనిచేస్తూ ఉండటంవల్ల, ఇంటికి వచ్చేటప్పటికి అతనికి వొళ్ళంతా హూనమైపోయినట్లుగా ఉండేది. పోనీ అంత కష్టపడి వచ్చినవానికి, ఇంటిదగ్గర సరైన తిండైనా ఉండేదా అంటే అదీలేదు. పైపెచ్చు వాళ్ళన్నయ్యగారి విద్యార్థులకు పాఠాలుచెప్పే బాధ్యత మీదపడేది. ఆ స్థితిలో అలా పాఠాలు చెప్పడానికి అతని మనసు ఉసూరుమనేది. కాని అన్నగారితో ఈ బాధనుగురించి చెప్పుకోడానికి అతనికి మనస్కరించేది కాదు. ఎవ్వరూ తనకు లేనిపరిస్థితిలో, తనను చేరదీసి, చదువు చెప్పించి, అన్నం బట్టా ఇచ్చి ఇంత ఉద్యోగంకూడ చూపించిన, ఆ అన్నగారి ఋణం తను ఎప్పటికీ తీర్చలేననుకొనేవాడు.

ఈవిధంగా రెండున్నర సంవత్సరాలు గడచిపోయాయి నారాయణరావుకి రైల్వేలో ఉద్యోగం చేయడానికి వీలైన వయస్సు వచ్చింది. కాని అతనికా విషయమే ఇప్పుడంతగా గుర్తులేదు. ఇప్పుడతని జీతం నలభై అయింది. ఈ రెండున్నర సంవత్సరాల ఊపిరి సలపని పనితో, సరియైన పోషణ లేకపోవ డంతో నారాయణరావు పూర్తిగా చిక్కిపోయాడు. ఒక రోజున అకస్మాత్తుగా మంచాన పడ్డాడు, ఆ సమయంలో, ఆ అన్నగారు మందు తెచ్చే బాధ్యతనుకూడ నెత్తిన వేసుకోలేక పోయాడు. నారాయణరావు ఆ జ్వరంతోనే గవర్నమెంటు

హాస్పిటలుకు పోయి మందుకోసం గంటలతరబడి నిలబడ్డాడు. ఇంటికి నడచివస్తూ రోడ్డుమీద కాళ్లు తేలిపోకుండా బలాన్ని చిక్కబట్టుకుంటూ నీళ్లు కమ్మిన మబ్బు కళ్ళతో ఆ యమ లోకానికి ఎలాగో ప్రాణాల్ని ఈడ్చుకొచ్చాడు. ఇంటిగుమ్మం ముందు కొచ్చేసరికి అతని కాళ్లు తేలిపోయాయి. దబ్బున ముందుకు తూలిపోయాడు. తలమీద బలమైన గాయం తగి లింది. ఇవన్నీ చూసికూడ మధుసూదనరావు జాలిపడలేదు. 'జాగ్రత్తగా నడిస్తే ఏం కొంపమునిగింది. ఏదో ముంచుకు పోతూన్నట్లు అంత కంగారుగా నడవకపోతే ఏం ?' అన్నాడు. నారాయణరావు మామూలుగా ఈ మాటలకంత పట్టించు కొనేవాడు కాదు. కాని ఆ జ్వరతీవ్రతలో ఆ మాటల కాత నిలో జ్వాలలు రేగాయి. ఇంక ఈ ఇంట్లో ఒక్క క్షణం ఉండకూడదనుకున్నాడు. కాని అంత జ్వరంతో ఎక్కడికి పోగలడు ? అయినా రోడ్డుమీద పోతూన్న ఒక రిక్షాను గబ గబా పిలచి, అందులో ఎక్కి షావుకారుగారి దగ్గరకు పోయి, అయిదు రూపాయిలు అప్పుతీసుకొని, వెంటనే గవర్నమెంటు హాస్పిటలో చేరిపోయాడు.

దీనితో మధుసూదనరావు ఇంటిలో ఆకాశమెత్తున లేచాడు. ఇరుగుపొరుగు వాళ్ళందరితోనూ, చూడండి వాడి కెంత పొగరో లోకంముందు మమ్మల్ని అవమానం పాలు చేయడానికి వాడెలాంటి సమయం చూసుకొని వెళ్ళిపో యాడో. ఇంత నీచుణ్ణి చేరదియ్యడం నాదే తప్పయింది.

ఇలాంటి వెధవకు చేసేకన్నా, వీధినిపోయే ఏ బిచ్చగాడికేనా చేస్తే ఇంత పుణ్యమేనా వచ్చేది. దుర్మార్గపు వెధవ. ఆనాటి కానాడు అంతమందిలోనూ అలా అన్నాడు. ఈ రోజు కీరోజు ఇలా చేశాడు. ఇంకా నయం ఈ సంవత్సరం వీడికి పెళ్లికూడా చెయ్యాలనుకున్నాను.' అని ఆయాసపడ్డాడు.

జ్వరం తగ్గినతరువాత నారాయణరావు అన్నగారింటికి వెళ్ళలేదు. మూడు రూపాయలకు గదొకటి అద్దెకు తీసుకొని, హోటల్లో భోజనం చెయ్యడం మొదలుపెట్టాడు.

తమ్ముడు దూరమై పోవడంతో మధుసూదనరావుకు చాలా నష్టమొచ్చినట్లు కనిపించింది. నారాయణరావు జీతం ఇప్పుడు చేతిలో పడకపోవడంతో ఇప్పుడతనికి బోలెడంత నష్టం వచ్చినట్లుగానే ఉంది. నిజానికి నారాయణరావు తినేదెంత? వట్టి పిట్టమేతగాడు. పైపెచ్చు ఆ నల్భైరూపాయిల లాభం పోగా, కుర్రాళ్లకు చక్కగా చదువుచెప్పి, తనకు ఎంతో శ్రమతగ్గించేవాడు. అంచేత తిరిగి ఎట్లాగైనా, అతనిచేత హోటలుతిండి మానిపించి, మళ్లీ ఇంటికి వచ్చేట్టు చేయాలనుకున్నాడు.

ఓమంచి రోజున శ్రీహరి దగ్గరకుపోయి, నారాయణరావు కుర్రకుంకనీ వాడికేమీ తెలియదని, వర్తమానసికోద్రేకనీ ఆ జ్వరతీవ్రతలో ఏదో మనసులో పెట్టుకుని, ఇలా లేచిపోయి వేరే ఉంటున్నాడని, అంచేత కొంచెం మెల్లగా చెప్పి తిరిగి యింటికి వచ్చేట్టు చేయమని, లేకపోతే తను ఈలోకంలో

ఇక తలఎత్తుకొని తిరగలేనని, ఏదో ఆ మూడు ముళ్లు పడి పోతే, తరువాత వాడెల్లా పోయినా ఇక తనకే బాధా ఉండదని చెప్పి ఇంటికి వెళ్ళిపోయాడు.

ఆ మరునాడు షావుకారు, నారాయణరావును పిలచి, 'ఏమిటయ్యా ఇంతా నిన్ను కష్టపడి చదివించి, ఇక్కడ కాలీ లులేక పోయినా, నన్ను నానాతిప్పలు పెట్టి, నీకు ఉద్యోగం ఇప్పించి, నిన్ను ఎంతో ఇదిగా చూసుకుంటూన్నందులకు... మీ అన్నయ్యకు నువ్వు చేయవలసిన మర్యాద ఇదా! బలే వాడివే... నువ్విప్పుడు ఇలా వేరుపడటం తప్పుకదూ! ఏదో మాట అన్నాడే అనుకో చిన్నవాడివి ఆ మాత్రం పడకూడదా... ఇంతలో కొంప మునిగిపోయిందేముంది. వెళ్లి వెంటనే మీ అన్నయ్యకు క్షమార్పణ చెప్పుకో. మరీ అంత కృతఘ్నుడుగా ఉండకు.' అన్నాడు తన అధికారాన్నంతా కంఠంలో విచిత్రాతి విచిత్రంగా ప్రదర్శిస్తూ.

అంతే. నారాయణరావు ఇక వాళ్ళన్నయ్య దగ్గరకు వెళ్ళక తప్పింది కాదు పాపం!

"జానుఏదో అన్నయ్య అన్నాడేలనుకో తనుసరిపెట్టుక పోవాలిగాని ఇలా అర్థంపర్థం లేకుండా అతన్ని అవమానాల పాలుచేయడం ఏం బాగుంది? అనుకున్నాడు. తనకింకా లోకం సంగతి బొత్తిగా తెలియదు అనుకున్నాడు. ఏమైనా ఇప్పుడు అన్నయ్యదగ్గరకువెళ్లకపోతే, రేపే అన్నయ్య వుద్యోగంలోంచి తీయిచేస్తే అప్పుడు తనేం చెయ్యాలి? అప్పుడు తనకు ఎవ్వరు

దిక్కు! అనుకున్నాడు. అలాగే తలవంచుకొని అపరాధంచేసిన వాడిలా అన్నయ్య దగ్గరకు చేరాడు.

తమ్ముణ్ణి గుమ్మందగ్గర చూడగానే మధుసూదన రావు, 'రారా... నారాయణా. నీకింకా మామీద కోపం పోలేదు. అసలిదంతా నాన్న నీకు బాగా నూరి పోశాడు. అప్పుడే నేను, నాన్నతో నేకలసి వుండినట్లయితే ఇప్పుడునువ్వూ నేను అడుక్కోవలసి వచ్చేది. నీకు తెలుసుగా నాన్న ఎలా దూబరా చేసేవాడో...ఎవరికి బడితే వాడికే డబ్బు ఇచ్చేసే వాడు. ఇప్పుడు దాని ఫలితం మనం అనుభవిస్తున్నాం. అప్పుడే నేను చెప్పినట్లు నాన్న, నిన్ను గుమాస్తాగా ఏషావుకారు దగ్గరో కుదిర్చి వున్నట్లయితే ఈపాటికి నువ్వీ ఊళ్ళో పెద్దషా వుకారు వైపోయి వుండేవాడివి. రామారావు నీతోటి వాడేగా ఇప్పుడు చూశావా...వాడెలా స్వంతంగా వ్యాపా రం చేసుకుంటున్నాడో... అయితే మీ కప్పుడు నామాట తలకెక్కింది కాదు. సరేలే ఇప్పుడవన్నీ ఎందుకనుకో. ఏమైనా మంచి చెపితే ఎప్పుడూ చెడ్డే ఎదురౌతుంది. ఆనాడు నువ్వూ నాన్నగారు నన్నెంతో అసహ్యించుకున్నారు. ఇంతకీ పోనీ ఈ చదువువల్ల పెద్దగా ఒరగబడే దేమేనా వుందా అంటే అదీ కనబడదాయె. బి. ఏ. చదివినవాడికి కూడ దిక్కులేకుండా వుంది. స్కూలు ఫైనలు గాళ్లు బంట్రోతు పనుల కెగబ్రాక వలసి వస్తోంది. పాపం శ్రీహరిగారు ఎంతో మంచివారు. నామాట త్రోసెయ్యలేదు. నీకక్కడ ఎంతో మంచి భవి

ష్యత్తు వుంది. ఏమైనా మనం ఎవ్వరినైనా అసలు నమ్మితే వాళ్ళూ మనల్ని నమ్ముతారు. మన ఇష్టంవచ్చినట్లు మనం నడుచుకుంటూ పోతే వాళ్ళకేనేమిటి మనం కావలసింది అన్నాడు. ఈ మహోపన్యాసంతో నారాయణరావు అన్న గారికి పూర్తిగా బానిసైపోయాడు.

నారాయణరావు మళ్ళీ తనపని తాను మామూలుగా చేసుక పోతున్నాడు. చివరికతను ఆ ఇల్లు ఆ కొట్టు తప్పించి ఇక మరేమీ జీవితానికి కావలసింది లేనట్లుగా మారిపో యాడు. ఒక పేపరుచూసేవాడుకాదు. ఇహ సినిమాలసంగతి సరేసరి. అసలు వాటిని చూడాలనే అతని కుండేదికాదు. తన పనేమిటో తనేమిటోగా మారిపోయాడు.

ఈ అవకాశం తీసుకొని మధుసూదనరావు తమ్ముణ్ణి బాగా ఉపయోగించుకోవడం మొదలు పెట్టాడు.

ఒక రోజున నారాయణరావుకు శివం కనిపించి రైల్వే ఎడ్వర్ టైజ్ మెంటు సంగతి చెప్పాడు లైబ్రరీకిపోయి ఇంగ్లీషు పేపరు ఫలానా తారీఖుది చదివి చూడమన్నాడు. పాపం నారాయణరావు తనకు తీరుబడి ఉండటం లేదని, అదేదో తనకు తెచ్చి చూపించమని అన్నాడు. శివం ఆ పేపరును తీసు కొచ్చి అతనికిచ్చాడు. ఇద్దరూ ఆ ఉద్యోగాలకు దరఖాస్తు పడేశారు. ఆ తరువాత ఆసంగతి గురించి నారాయణరావుకు ఏవిధమైన జాబూ రానేలేదు.

ఇలా వుండగా మరో సంవత్సరం గడచిపోయింది. ఆ వీధిలోని వాళ్ళందరూ, నారాయణరావుకు వాళ్ళన్నయ్య పెళ్ళి చేయకపోవడం గురించి, అతని స్వార్థపరత్వం గురించి, అతని ఎదుటే ఏదో ఒకటి అని పోతూవుండేవారు. ఈ బాధ నెలా తప్పించుకోవాలో మధుసూదనరావుకు అర్థమయ్యేది కాదు. కాని, 'కుర్రకుంకండీ వాడికప్పుడే పెళ్లేమిటి' అనేవాడు కొందరితో. మరికొందరితో 'వాడు ఏదైనా మంచి ఉద్యోగం దొరికేవరకు పెళ్లి చేసుకోనంటున్నాడు' అనేవాడు.

ఒక రోజున భార్య ఏమంటుందో అని ఆమెతో ఈ విషయం సంప్రదించి చూశాడు. ఆమె పేదవాళ్ళ పిల్ల నొక దాన్ని చూసి, పెళ్ళిచేసేస్తే బాగుంటుందని సలహా ఇచ్చింది. అలా చేయడంవల్ల ఆ పిల్లకూడా తమకు అణిగిమణిగి ఉంటుందని, ఇంట్లోని చాకిరీ అంతా ఆ అమ్మాయిచేతనే చేయించుకోవచ్చుననీ ఆమె సూచించింది. ఈ విషయాలు మధుసూదనరావుకు బాగానచ్చాయి.

వెంటనే అతను పేదకుటుంబాల పిల్లలకోసం వాకబు చేయడం మొదలుపెట్టాడు. ఆంధ్రదేశంలో అలాంటి పిల్లల కోసం ఏమాత్రం శ్రమపడ నవసరంలేదని అతను ఇట్టే గ్రహించాడు. కాని ఆ పేదవాళ్ళలో మరీ నిప్పచ్చరంతో అటమటించిపోతూన్న వాళ్లకు తను దేవదూతై, వాళ్ళదగ్గర ఉన్నది కాస్తా అర్పేసి, వాళ్ళమ్మాయిని నారాయణరావుకు వివాహం చేయడానికి అతి కష్టంమీద అంగీకరించాడు,

అసలు నారాయణరావుకు పెళ్లి చేసుకోవాలనే లేదు. అన్నయ్య మాటకు వ్యతిరేకిస్తే, అతను ఏమనుకుంటాడో అన్న భయం తప్పించి, మరేమీ అతనికి కలగలేదు. పెళ్లి వద్దంటే కట్నం ఏమీ లేదని ఇలా దొంగెత్తు వేస్తున్నాడని అంటాడేమోనని బాధ పడ్డాడు. అయినా కొంచెం మెల్లగా, 'నా కిప్పుడే పెళ్లి వద్దన్నయ్యా' అంటూ అన్నగారి ఎదుట తలవంచాడు. వెంటనే మధుసూదనరావు కయ్‌మని లేచి, ఊళ్ళో నేనేమైనా తలెత్తుకుతిరగాలనుకుంటున్నావా లేదా... నీకేం చల్లగా వద్దంటావ్; నాబాధ నీకేం తెలుసు. నేనేదో నీకు అన్యాయం చేసేస్తున్నానని ఆ వెధవలంతా నోటికొచ్చి నట్లు అలా అఘోరిస్తూంటే చూడటం లేదూ... ముందు కెళ్లితే గొయ్యి. వెనక్కెళ్ళితే నుయ్యిగా వుంది నా వ్యవహారం' అన్నాడు. నారాయణరావు ఇక ఆ విషయంలో నోరెత్తలేదు.

మొత్తంమీద ఓ శుభముహూర్తాన గుళ్లో పెళ్ళయిందనిపించారు. అయితే మధుసూదనరావు, అతని భార్య తలచినట్లు, నారాయణరావు భార్య పేదపిల్లయినా, వాళ్ళ అదుపాజ్ఞలకు అణిగిమణిగి ఉండే పిల్ల కాకుండా పోయింది. ఆమె రాగానే అక్కడి పరిస్థితులన్నీ కొన్నాళ్లలోనే పూర్తిగా ఆకళింపు చేసుకుంది.

ఓరోజున భర్తతో, 'ఏమిటీ అరవచాకిరీ...వాళ్ళక్రింద పడి ఉండటమేమిటి ఇదేం బాగులేదు' అంది.

నారాయణరావు అమాయకంగా, 'నీకేమీ తెలియదూరుకో... అన్నయ్య దేవుడు లాంటివాడు. అన్నయ్యే లేకపోతే, ఈపాటికి నేనేమైపోయేవాడినో' అన్నాడు.

అయితే అంతటితో ఆమె ఆగిపోలేదు. 'మీరు మరీ అంత చంటిపిల్లల్లా ఉంటే ఎలా... మనం వీళ్ల క్రిందపడి చాకిరీ చెయ్యడానికే పుట్టామా... మీవదినగారు ఆనాడు, మీకూ మీ నాన్నగారికి చాకిరీ చెయ్యవలసి వస్తుందని, మొగుడిచేత వేరింటి కాపురం పెట్టించేసింది. ఆ ముసలాయన ప్రాణాలు నిలువునా తీసింది. మీ అన్నగారు ఆమె అన్నదానికల్లా తందాన అంటున్నాడు. ఏదో మీ అన్నగారు ఒక సంవత్సరం దయతలచి ఎల్లాఅయితేనేం చదివించారని, మీరు ఎల్లకాలం మీ సంపాదనంతా వాళ్లకే ధారపోస్తే, ఇక మనం బ్రతికి బట్ట కట్టినట్లే... మీ నాన్నగారు మీ అన్నగారిని అన్ని సంవత్సరాలు పెంచి పోషించి చదువు చెప్పించినందులకు, మిమ్మల్ని మీ అన్నగారు, కనీసం బి. ఏ. వరకైనా చదివించవలసింది. అదంతా పోయి ఇదేదో పుణ్యానికి చేస్తున్నట్లు, వాళ్ళకు మనమేదో బాకీ ఉన్నట్లు మీరనుకోవడం ఏమీ బాగులేదు. ఒక్క పైపై వేట్లు చెప్పడంవల్లే మీ అన్నగారికి మీరెంత ధారపోస్తున్నారో ఒక్కసారి ఊహించుకోండి...' అంది.

పాపం నారాయణరావు మనసు ఆమెకేమీ బదులు చెప్పలేకపోయింది. అన్నగారిని విడచి వేరింటి కాపురం పెట్టడానికి ఒప్పుకోలేకపోయింది.

నారాయణరావు భార్య రావడంతో, ఏవో కొత్త కష్టాలు వచ్చినట్లు భావించుకోవడం మొదలుపెట్టాడు. ఆడ వాళ్లు ఎంతకైనా తగుదురనుకున్నాడు. అన్నగారు తనయెడల అప్పుడప్పుడు కఠినంగా ఉండటానికి వదినగారే కారణం అనుకున్నాడు. అలాగని చేరదీసి, చదువు చెప్పించి, ఉద్యోగం యిప్పించిన అన్నగారితో విరోధం పెట్టుకొని తను బ్రతకలేననుకున్నాడు.

మధుసూదనరావు ఏమి తలపెట్టి తమ్ముడికి ఈ వివాహం చేశాడో, అదికాస్తా జరగకుండాపోయి చివరికిలా పరిణమించి నందులకు, భార్యమీద అతనికి ఎక్కడలేని కోపం వచ్చింది. ఇందుకనే ఆడవాళ్ళ సలహా ఎప్పుడూ వినగూడదు అనుకున్నాడు. భార్య, తనతో, తోటికోడలు వ్యవహారాలు రోజురోజుకూ ముదిరిపోతున్నాయి అని చెప్తుంటే, 'అనుభవించు' అన్నాడు. 'అసలు వాడికి పెళ్ళిచేయకుండానే ఉండవలసింది, అప్పుడే గొడవా వుండకపోయేది. పేదవాళ్ళ పిల్లయినంత మాత్రంలో బుద్ధులు పేదవై పోతాయనుకున్నావు కాబోలు... ఇంకొన్నాళ్లు పోతే నీ చలవవల్ల వాడిక్కడే పాతుకపోయి, ఈ పైన్రివేట్లు చెప్పించుకునే కుర్రాళ్ళ నందరినీ తనవైపు తప్పకుండా తిప్పుకుంటాడు. దానితో మనపని తిరుపతికుపర మాతుంది' అంటూ గంగవెర్రు లెత్తిపోయాడు.

అప్పటినుంచీ మధుసూదనరావుకు తమ్ముణ్ణి ఆ యింట్లోంచి బయటకు ఎలా తోలెయ్యాలన్నది సమస్య అయిపో

యుంది. ఎలాగో ఓలాగ అతన్ని ఇక్కడనుంచి చల్లగా బయటకు గెంటెయ్యాలనుకున్నాడు.

శ్రీహరి దగ్గరకు మెల్లగా ఓరోజునపోయి 'ఏదో నా బరువు దింపుకున్నాను. నేను చేయగలిగిందంతా నేను చేశాను. చదువు చెప్పించి, ఉద్యోగం ఇప్పించి, పెళ్ళిచేసి వాడ్ని ఓ ఇంటివాడిని చేశాను. మనం ఎంతచేస్తే మాత్రం ఏం లాభం. తమ్ముడు మనవాడౌతాడు కాని పిల్ల మనదౌతుందా... ఏం చెప్పను శ్రీహరీ... ఆ అమ్మాయి గుణం నాకు నచ్చలేదు. ముందు వచ్చిన చెవులకన్నా వెనుక వచ్చిన కొమ్ములు వాడని— ఆ పిల్ల మా ఆవిడికే పనులు పురమాయించడం మొదలుపెట్టింది. దానికేంలే... చిన్న పిల్ల... తెలియనిదని సర్దుకుపోతూంటే ప్రతిదానికీ ఏదో చిలిపి కయ్యం లేవదీస్తూంది. ఏం చెప్పను ఇలాంటివన్నీ ఒకరితో చెప్పుకోవలసినవి కావు. తమ్ముడు రత్నంలాంటివాడు. వాడ్ని విడిచిపెట్టడం నాకు సుతరామూ ఇష్టంలేదు. కాని ఆ అమ్మాయి చేష్టలు చూస్తూ ఉంటే పరిస్థితులు విషమించేలా గున్నాయి. ఏమైనా మంచిగా వున్నప్పుడే మంచిగా విడిపోవడం మంచిది. ఈ విషయమంతా నా నోటితో వాడికి చెప్పడానికి నాకు మనస్కరించడం లేదు. నీకు పుణ్యముంటుంది; ఎలాగో ఓలాగ వాడ్ని మీ బెజవాడ బ్రాంచిలో వేశావంటే రెండు పనులూ నెరవేరుతాయి అన్నాడు. ఈ మాటలకు శ్రీహరి నవ్వుకున్నాడు. 'సరేలేవయ్యా వీలునుబట్టి మీ వాడ్ని అక్కడకు మార్చేస్తాలే' అన్నాడు.

శ్రీహరి నారాయణరావును అసలు ఎప్పుడో విజయవాడ బ్రాంచిలో వేసి ఉండేవాడు. అంతమంచివాడు అక్కడ ఉండడం ఎంతైనా మంచిదని ఆతనికి బాగా తెలుసు. కాని మధుసూదనరావు ఎక్కడ ఏడ్చిపోతాడో అని ఆపని చేయ లేదు. తీరా మధుసూదనరావే వచ్చి ఇలా చెప్పేప్పటికి 'సరే అన్నీ బాగానే కుదిరాయి' అనుకున్నాడు.

నారాయణరావు, శ్రీహరి తన్ను ఇంత అకస్మాత్తుగా బెజవాడకు మార్చినందులకు ఆశ్చర్యపోయాడు. అక్కడ ఈ నలభై రూపాయల జీతంతో తను ఎలా ఈ సంసారాన్ని ఈదగలనని హడలిపోయాడు, అన్నయ్యను శ్రీహరికి చెప్ప మని బ్రతిమాలాడు. కాని మధుసూదనరావు 'ఏదొచ్చినా మన మంచికొరకే వస్తుంది. శ్రీహరికి నీమీద మంచి అభిప్రాయముంది. నీట ముంచినవాడు పాల ముంచక మానడు' అన్నాడు. అందుకు తగ్గట్టుగానే శ్రీహరి నారాయణరావు జీతం నలభై నుంచి యాభై చేశాడు. పది రూపాయలు పెరిగాయన్న మాటేగాని బెజవాడలో అవి ఏమూల? అయినా అతను అక్కడకు వెళ్ళక తప్పలేదు. తొమ్మిది రూపాయలకు ఇల్లొకటి అద్దెకుతీసుకొని అందులో కాపురంపెట్టాడు. అక్కడ ఆ చుట్టుపట్ల జీతాలిచ్చి ప్రైవేట్లు చెప్పించుకొనే కుర్రవాడొక్కడూ కనిపించలేదు. అసలే అతను వుండేది ఒక మురికి పేట. ఇహ అతని దగ్గరకొచ్చి ట్యూషను చెప్పించుకొనే దెవ్వరు? అంత తాహతుగలవాళ్ళక్కడ ఎవ్వరూ లేరు.

ఎక్కడికైనా పోయి చెప్పుదామన్నా ఆతనికి వీలుచిక్కేది కాదు. దానితో అతనికష్టాలు బాగా పెరిగిపోయాయి ఈలోగా భార్యకుపురుడువస్తే ఆమెపుట్టింటివాళ్ళు కటికిబీదవాళ్ళవడంవల్ల, పురిటికయ్యే ఖర్చంతా అతనే భరించవలసి వచ్చింది. దానితో అతనికి అప్పులు పెరిగిపోవడం మొదలుపెట్టాయి. భార్యముక్కు పుడకా చెవుల దుద్దులూ తాకట్టు పెట్టాడు. అక్కడక్కడ చిల్లర అప్పులు వందదాకా పెరిగాయి. అవిగాక ఓ రాక్షసుడి దగ్గర విపరీతమైన వడ్డీకి వందరూపాయలు అప్పు పుచ్చుకున్నాడు. వందరూపాయలు అప్పు అన్నమాటేగాని, అవి ఆ కిరాతకుని చేతిలోంచి ఎనభై రూపాయలుగానే రాలేయి. వాడు రోజూ ఇంటిమీదపడి గోల చేయడం మొదలుపెట్టాడు, ఇస్తావా చస్తావా అని పీకమీద కూర్చున్నాడు. ఎల్లుండికి వాడి చేతిలో కనీసం ఎనభైరూపాయలైనా పెట్టకపోతే నానారభస చేసేట్లుగా ఉన్నాడు.

అనంతంగా వచ్చి పడుతూన్న ఈ బాధలతో నారాయణరావు ఒక్కసారిగా ఉస్సురని పోయాడు. ఈ బాధలను భరించలేక ఏ ఏట్లోనో పడి ఒక్కసారి చచ్చిపోయినా బాగుండు ననుకున్నాడు. పోనీ అన్నగారి దగ్గరకు వెళ్తే ఏమైనా వీలుంటుందేమోనని ఆశపడ్డాడు.

నారాయణరావు తలవంచుకొని, ఈ బాధల నన్నీ ఒక్కటొక్కటిగా తలచుకుంటూ,అన్నగారి గుమ్మంఎక్కాడు. అప్పుడు వీధిలోనే నిలుచున్న వదినగారు పలకరించకుండానే

ఇంట్లోకి వెళ్ళిపోయింది. "అంతా బాగున్నారా...బాబు ఎట్లా ఉన్నాడు" అనైనా అడుగలేదు. పాపం నారాయణ రావు గుండెల్లో ఈ విషయం తలపునకు రాగానే జివ్వుమంది. పిల్లలు లేనివాళ్ళకు పిల్లలంటే అసలు ఇష్టముండదేమో అనుకున్నాడు. పిల్లలులేని వదినగారికి మరిదిగారి పిల్లలంటే అసహ్యముండటం సహజమేమో అనుకున్నాడు. పోనీ తననైనా పల్కరించవచ్చునా... ఇన్నాళ్ళకు వచ్చినందులకు ఆమె చూపించవలసిన మర్యాద ఇదేనా... ఇంతలో ఇంటిలోంచి అన్నగారు బయటకొచ్చి "ఏరా బాగున్నావా" అని ముక్తసరిగా మాటవరుస కన్నట్లు అన్నాడుగాని, "ఇదిగో తమ్ముడొచ్చాడు, నీళ్లియ్" అనలేదు. కొన్నాళ్లక్రితం, మధుసూదనరావు బెజవాడ వచ్చినప్పుడు, ఈ తమ్ముడు ఆతని అడుగులకు మడుగులొత్తాడు: ఎంతో మర్యాద చేశాడు. తనదగ్గర డబ్బులేక పోయినా అప్పుచేసి పిండివంటలు చేయించాడు.

మధుసూదనరావు ఒకసారి అటూఇటూ చూసి "కూర్చోమని చెప్పాలా ఏమిటిరా. కూర్చో...ఆఁ...ఏమిటి సంగతి".

నారాయణరావుకు ఏమిచెప్పడానికీ తోచలేదు. అతని కంఠం ఏమిటో వణికింది. ఆతని కళ్ళలో నీళ్లు తిరిగాయి. అతని కడుపులో ఎవ్వరో చేయిపెట్టి కలచినట్లయింది. 'ఏమి లేదన్నయ్యా... అక్కడ పరిస్థితులు చాల విషమించి పోయాయి' అన్నాడెల్లాగో,

మధుసూదనరావు దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు మొగం పెట్టి, 'అంటే' అన్నాడు.

నారాయణరావు కంఠం జాలిగా వణికింది. "బాబు పుట్టిన తరువాత చాల ఇబ్బంది పడిపోతున్నామన్నయ్యా, పురిటికే బోలెడంత అయింది" అన్నాడు.

మధుసూదనరావు ఇక కొంచెం జాగ్రత్తగా ఉండాలని వెంటనే అనుకున్నాడు. మెల్లగా, "ఔనురా. మరి కష్టాలు మనిషికి రాక మ్రానుకొస్తాయా. సంసారమన్నప్పుడు ఇలాగే మరి ఏవో ఒకటి వస్తూ ఉంటాయి. జాగ్రత్తగా సర్దుకుపోవాలిగాని, అలా బెంబేలు పడిపోతే ఎలా" అన్నాడు.

"అది కాదన్నయ్యా, ఎల్లుండికి ఇవ్వకపోతే, ఇంట్లోని సామానంతా బయట పడేట్లుగా ఉంది" అన్నాడు నారాయణరావు వెలాగో.

మధుసూదనరావు మనసులో 'వీడెక్కడ దాపురించాడోయ్ మాకు' అనుకున్నాడు. పైకిమాత్రం, 'అయితే ఇప్పుడు నన్నేం చెయ్యమంటావ్' అన్నాడు.

నారాయణరావు అతి కష్టంమీద "ఒక నూట యాభై ఉంటే సర్దుబాటు చెయ్యన్నయ్యా. నోటు రాసిస్తాను" అన్నాడు.

వెంటనే మధుసూదనరావు తెలివిగా నవ్వి, "ఈ మాత్రం దానికి నువ్వు అక్కడనుంచి ఇక్కడకు, అనవసరంగా డబ్బు పాడుచేసుకొని రావాలటరా, ఒక కార్డుముక్క రాస్తే పంపనూ... కాని." అని ఇంకా ఏమిటో అనబోయాడు.

వెంటనే నారాయణరావు, అన్నగారు అలా మెత్తగా మాట్లాడగానే అందులో డబ్బుయివ్వడానికి ఏదో సూచన ఉన్నట్లుగా భావించి, 'అక్కడనుంచి వచ్చేప్పుడు నాకేమీ ఖర్చు కాలేదన్నయ్యా. నాతో ఈ వూళ్ళో అప్పుడప్పుడు తిరుగుతూ ఉండేవాడు, శివాన్ని ఎరుగుదువుగా వాడు నీకుకూడ చెప్పాడటగా తనకు రైల్వేలో ఉద్యోగం అయిందని! వాడు నన్నక్కడనుంచే ఇక్కడకు ఊరకనే తీసుకొచ్చాడన్నయ్యా' అన్నాడు. అలా అని తిరిగి అతనే, అన్నగారి ముఖంలోని భావాలను గమనించకుండానే, 'దేనికైనా అదృష్టం ఉండాలన్నయ్యా, నాకన్నా వాడికి తక్కువ మార్కులొచ్చాయి. అయినా వాడికి ఉద్యోగం వచ్చింది. నాకావుద్యోగం కలుగలేదు. నేనీ అప్పుల్లోబడి కొట్టుకుంటున్నాను. ఇక ఈ విషయంలో నువ్వు ఈ ఒక్కసారికీ ఆదుకోవాలన్నయ్యా. నాన్న పోతే చేరదీసి, చదువుచెప్పించి, ఉద్యోగం ఇప్పించి చివరకు నీ చేతులతోనే పెళ్ళికూడా చేశావు. నీమేలు జన్మజన్మలకి మరచిపోలేనన్నయ్యా. ఈ కష్టంలో నువ్వుతప్ప, నన్నిక ఆదుకొనే వారెవరన్నయ్యా." అన్నాడు. నారాయణరావు, అన్నగారిముందు ఈవిధంగా మాట్లాడగలుగుతానని ఎప్పుడూ అను

కోలేదు ఈ మాటల కతనికే ఆశ్చర్యం వేసింది. చాలబాగ మాట్లాడేనని అనుకున్నాడు. ఇక అన్నగారేమంటాడో అని అతని మొగంలోకి తలఎత్తి చూశాడు.

మధుసూదనరావు ఎంతో బాధపడుతున్నట్లుగా 'అం తేరా దేనికైనా అదృష్టం కలిసిరావాలి. లేకపోతే ఆ వెధవకి రైల్వేలో పని దొరకడం ఏమిటి? నీకు దొరకక పోవడ మేమిటి? పోనిస్తూ వెధవ రైల్వే వుద్యోగం. అందులో పని చేసేవాడు ఒక్కడూ నిజాయితీగా చచ్చేడ్వడు. నీలాంటి వాడికి అసలు అలాంటిపని సరిపడదు కూడాను. సరే. ఇంతకీ నాదగ్గర ప్రస్తుతం డబ్బులేదు. రేపు బ్రహ్మంగారిని అడిగి ఓ వంద సర్దు బాటు చేస్తాను. ఐతే ఇప్పుడు నీ జీతం ఎంత!' అంటూనారా యణరావు మొగంలోకి చూశాడు.

నారాయణరావు ఉబ్బితబ్బిబ్బైపోయాడు. 'యాభై అయిదు అన్నయ్యా' అన్నాడు వెంటనే.

'అరే, ఇంత తక్కువ జీతంతో పిల్లలుగలవాళ్లు బ్రత కాలనా చావాలనా, నేను శ్రీహరికి చెప్తాలే. ఇంకో పది పెంచ మని' అన్నాడు.

నారాయణరావు హృదయం ఒక్కసారి ఏ లోకం లోనో విహరించింది. ఒక్కసారి వసంతోదయ మయినట్లు ఆతని కనిపించింది. తను వచ్చిన పని ఇంత సులువుగా నెరవేరు తుందని అతను కలలోకూడా అనుకోలేదు. అన్నగారికి ఎలా

కృతజ్ఞత చూపాలో తెలియక, 'నీ మేలు మరచిపోలేన న్నయ్యా' అన్నాడు.

వెంటనే మధుసూదనరావు 'అదేమిటిరా అలా మాట్లాడుతావు ఎవడో బయటివాడిలా. పిచ్చోడా' అని 'అలా వీధిలోకి వెళ్ళి ఇప్పుడే వస్తా' నంటూ వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి వదినగారు, సంవత్సరాని కొక్కసారికూడా రాని మరిదిగారికి పట్టె పచ్చడీ అన్నం పెట్టి, కొద్దిగా బీర కాయ కూరవేసి, ఓ గ్లాసుడు మజ్జిగదగ్గర పెట్టింది. నారాయ ణరావు కెందుకో ఆ అన్నము గొంతుక దిగలేదు. అతని కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి. లోకంలోని అందరి వదినెలూ ఇలాగే ఉంటారా అనుకుంటూ మనసులో కుమిలి కుమిలి ఏడ్చాడు. అన్నయ్య మంచివాడే కాని భార్య ఇట్లాంటిదైనప్పుడు ఏం చెయ్యగలడు అనుకున్నాడు. తీరా అన్నయ్య డబ్బు ఇచ్చేప్ప టికి వదిన ఏం అడ్డుపుల్లలు వేస్తుందో అని హడలి పోయాడు. ఈ రోజున వదినగారికి కూడా నామీద దయకలిగేట్లు చేయి భగవంతుడా అని మనసులో ఏమిటో ధ్యానించుకున్నాడు. వదినగారు మాట్లాడకపోయినా, తనైనా మాట్లాడి ఆమెను మంచిచేసుకోవాలని, 'బాబుఇప్పుడిప్పుడే తప్పటడుగులువేస్తు న్నాడు వదినా' అన్నాడు. అప్పుడు నారాయణరావుకు బాబు కళ్ళల్లో ఆడాడు. 'ఒక్కసారివాడి నవ్వుమొగం చూస్తే అన్ని బాధలూ మరచిపోవచ్చు అనుకున్నాడు. వాడిప్పుడు పాలకో సం కింకపెడుతున్నాడో ఏమో అనుకున్నాడు. అలా అను

కుంటూ వదినగారు ఏమి చెబుతుందో అని, తలఎత్తి ఆవైపు చూశాడు. పాపం! నారాయణరావెంతమాయకుడు! ఆక్కడ వదినగారు ఉంటుందనుకున్నాడు కాబోలు. ఆమె అక్కడ నుంచి ఎప్పుడో వెళ్ళిపోయింది.

వరండాలో మంచం వేసుకొని ఓ చిరుగుల దుప్పటి అన్నగారు పారేస్తే అది పరచుకొని, ఆ మంచంమీద నారాయణరావు పడుకున్నాడు. కళ్లు మూసుకున్నాడే కాని అతని కెంచేతనో నిద్ర రావడం లేదు. అతనికి వాళ్ళ వదినగారు ఒక భూతంలా కనిపించడం మొదలుపెట్టింది. ఆ డబ్బు తన చేతిలో పడుతుందా అని అతనికి అనుమానం వేసింది.

అప్పటికి అర్థరాత్రి దాటి ఉంటుంది. అయినా అతనికి నిద్ర రావడంలేదు, ఏదో అన్యాయం తనకు జరుగుతూన్నట్లుగా అతని మనస్సు ఊరికే శంకిస్తూంది. అంతా నిశ్శబ్దంగా ఉంది. ఎదురుగుండా ఓ కుక్క నా బ్రతుకంతా దుఃఖమయం అని కాస్సేపు హృదయ విదారకంగా ఏడ్చి ఏడ్చి ఎక్కడకో వెళ్ళిపోయింది. మళ్లీ దాని ఏడ్పు వినిపించలేదు. ప్రక్క నున్న గదిలోని గడియారం ఏదో ఆపదను సూచిస్తూన్నట్లు, టిక్కు టిక్కు మనడం అతనికి స్పష్టంగా వినిపిస్తూంది. ఇంతలో ఆ గదిలో ఏదో కదిలినట్లయింది. నారాయణరా వసలే బేల గుండెవాడు. హైడ్రోజన్ బాంబు ప్రేలితే వచ్చే విషవాయువులకు చేరువగా గుండెలు చేత్తో పట్టుకొని కూర్చున్నాడు. ఆ వాయువులు అతనిపై ప్రశర వేగంతో వీచడం మొదలుపెట్టాయి.

"ఎందుకు మీారు వంద రూపాయ లివ్వడం ?"

"దానికో కారణం ఉందిలే"

"నాకు చెప్పగూడదా ?"

"అబ్బ చెప్పగూడదని కాదు."

"అయితే చెప్పడానికేం ?"

"రేపు చెప్తా నంటున్నాగా."

"సరేలెండి."

"అబ్బ! నీతో చెడ్డ చిక్కు...చెప్పేవరకు వదలవ్... వాడికి రైల్వే ఉద్యోగం వచ్చింది తెలుసా?"

"ఎప్పుడూ ?"

"అంత కంగారు పడకు... ఆ ఆర్డరు కాగితం నేను చింపేశాను. వాడు మన అడ్రసు ఇచ్చి అప్లికేషను పంపి ఉంటాడు."

"అదేమిటి... అలాచేశారేం ?"

"నా ఇష్టం...ఎలాగో చేసుకుంటాను. నీకెందుకూ... వాడు తెలివైనవాడు. తెలివైనవాడెలాగైనా బ్రతుకుతాడు. పిచ్చిదానా... ఇప్పుడు ప్రజలు అన్నయ్య ఆదుకోకపోతే, తమ్ముడు ఏమైపోయి ఉండేవాడో అంటారు. ఆ ఉద్యోగం వాడి కొచ్చిందంటే మనవే రెవ్వరెత్తుతారు ? ఇప్పుడు చూశావా మనచుట్టూ వాడెలా తిరుగుతున్నాడో..."

అంతే... ఆ విషవాయు ప్రసారం ఆగిపోయింది.

అయితే ఆవేళకూడా తెల్లవారింది.

మధుసూదనరావు, తమ్ముడు పడుకున్న మంచం దగ్గరకు ప్రొద్దున్నే వచ్చాడు.

అక్కడ ఏముంది?

ఏముంటుంది?

ముడతలు పడిపోయిన దుప్పటి ముద్దగా ముకిళించుకొని, కుమిలి కుమిలి, వినబడకుండా విలపిస్తూంది. 'నేనేం చేశాను... నేనేం చేశాను' అని.

ఈ దృశ్యం చూడగానే, ఒక్కసారిగా మధుసూదనరావు మొగం వివర్ణమైపోయింది. అతని ఎదలో లక్ష మార్పులు కలిగాయి. అతని గుండెలోనికి లక్ష విచ్చుకత్తులు దూసుక పోయాయి. ఒక్కసారిగా అతను పిచ్చిగా గుండెల్ని బాదుకుంటూ 'తమ్ముడూ' అని గొల్లున ఏడ్చాడు. 'ఎంతపని చేశాను తమ్ముడూ...' అని జుత్తు పీక్కుంటూ, ఆ వీధిలో ఎంద రాపినా ఆగకుండా అలాగే పరుగెత్తుతున్నాడు. 'అయ్యో... నేనేమి చేశాను... నేనేమి చేశాను' అంటూ.

—స్వతంత్ర, 12-8-1955.